26-5-79

# రాముని శపథం

రచన:— జి రామలక్ష్మి, హైద్రాబాదు.

యమునానదీ తీరమున ఒక చిన్న గ్రామం ఉంది. అ గ్రామంలో ఒక వయసుమళ్ళిన ముసలిది ఉంది. దానికి ఒక కొడుకూ, ఒక కూతురూ వున్నారు. కొడుకు పేరు రాముడు, కూతురు పేరు వనజ. కూతురుకి వివాహము చేయదలచి, ఆ ముసలిది యెంతోకాలమునుంచి కష్టపడి పనిచేసి కూడబెట్టిన ధనమును ఒకసంచిలో దాస్తూవచ్చింది.

అదితెలిసిన ఒక దొంగ ఒకనాడు ఎవ్వరూ లేని సమయమున ప్రవేశించి, ఆ ధనముగల సంచిని కాజేశాడు. తన సంచి లేకపోవడంచూసి ఆ ముసలిది లబోదిబో మని మొత్తుకుని ఏడవసాగింది.

తల్లిని ఓదారుస్తూ రాముడు, "అమ్మా! ఏడవకమ్మా! ఎలాగయినా ఆ దొంగను పట్టుకుని, వాడ్ని మోసగించయినా పరే, మన సొమ్మును తీసుకువస్తాను. అంతవరకూ నేను ఇంటికివస్తే, నా పేరు రాముడేకాదు." అని శపథంపట్టి, తల్లి ఎంతచెప్పినా వినకుండా బయలుదేరాడు.

అలా చాలాదూరం వెళ్ళి ఒక చెట్టునీడన వున్న బావి గట్టుమీద కూర్చున్నాడు. ఇంతలో అటువైపే పోతున్న ఒక మనిషి చేతిలో తమ డబ్బు సంచిని చూశాడు. బహుశా ఆ దొంగ వీడే అయి వుంటాడు. వీడిపని నేనుపడతాను. అని అనుకుని, గట్టిగా వాడికి వినిపించేలా ఏడవటం మొదలెట్టాడు.

అదివిని ఆ దొంగ వెనక్కివచ్చి, "ఎందుకు బాబూ! ఏడుస్తున్నావు? ఏమయింది?" అనడిగాడు.

"మా అమ్మ ఒక బంగారు గొలుసు యిచ్చి, దానిని అమ్మి సొమ్ముచేసుకు రమ్మంది. వస్తూ వస్తూ నేను దారిలో యీ బావినిచూసి, ఇందులో నీరుందో లేదోనని తొంగిచూశాను. ఆ గొలుసు నా చేతిలోనుంచి జారి యిందులో పడింది. అది రెండు వేలు విలువ. అది లేకుంటే మా అమ్మ నన్ను చంపేస్తుంది." అంటూ మళ్ళీ ఏడవటం మొదలు పెట్టాడు.

అదివిని ఆ దొంగ ఎలాగయినా యీ బావి లోకి దిగి, ఆ గొలుసును దాచేసి, దొరకలేదని చెప్తేసరి, వాడు వెళ్ళిపోతాడు. అప్పుడు నేనే ఆ గొలుసును తీసుకోవచ్చు. అనిమనసులో అనుకుని, ఆనందపడ్డాడు.

"ఈ సంచినీ, నా బట్టలనూ జాగ్రత్తగా చూస్తూండు. బావిలోకి దిగి, నీ వస్తువును నేను తెస్తాను." అని ఆ దొంగ బావిలోకి దిగాడు.

తన ఎత్తు పారిందని రాముడు చాలా సంతోషించాడు. ఆ దొంగ లోపలకు దిగినవెంట రాముడు ఆ సంచి తెరిచి చూశాడు అది వాళ్ళ అమ్మదాచిన సంచేనని గుర్తించాడు సొమ్ము తరిగినట్టుగా కనిపించలేదు. ఇదేసమయమని అవి పట్టుకుని రాముడు పరుగుతీశాడు.

ఎంత వెదికినా కనబడకపోయేసరికి విసుగెత్తి, దొంగ పైకివచ్చాడు. పైకివచ్చి చూసేసరికి వాడి గుండె గుభేలుమన్నది. ఆ పిల్లవాడూ లేడు సంచీలేదు, బట్టలూ లేవు. ఆశకుపోయి, ఉన్న కూడా పోగొట్టుకున్నానే! అనివిచారంగాతనదారిన వెళ్ళిపోయాడు.

రాముడు తన శపథం నెరవేరిందని సంతోషంతో ఇంటికి వచ్చి, తల్లిని పిలిచి, జరిగిందంతా చెప్పాడు.

"చూశావా, అమ్మా! నా శపథం నెరవేరుకున్నాను." అన్నాడు గర్వంగా.

కొడుకు తెలివికి ఎంతో సంతోషించింది ముసలిది.